# 34. హాయమైన మర్డర్ కేసు

మహారాజా తుకోజీరావు హోల్కార్ వారు తాను మరాటా సింహం శివాజీ చక్రవర్తికి అసలు సిసలు వారసుడనని నమ్మే మహాప్రభువు.

అందువలన మహారాజా వారికి తన అధికారాన్ని కుంచింపజేస్తున్న బ్రిటిష్ వారంటే మహామంటగా ఉండేది. బ్రిటిష్‌వారికేమో ఎలాగోలా ఈ దేశాన్నంతటినీ తమపెత్తనం క్రిందికి తెచ్చుకోవటం, కనీసం రాజుల్నీ మహారాజుల్నీ తమ చెప్పుచేతలో ఉంచుకుని అధికారం సుస్థిరం చేసుకోవటం తప్ప మరో యావలేదు. ఆ విషయంలో వారు దాదాపు అన్ని సంస్థానాలలోనూ జెండా ఎగరేసేరు.

కానీ... !

తుకోజీరావు హోల్కార్ వారు మాత్రం వారికి మింగుడు పడలేదు.

హోల్కార్ వారు చదవటానికైతే పాశ్చాత్య పద్ధతుల్లో, అక్షరాలా బ్రిటిష్ రాచరికానికి భక్త బృందాన్ని తయారుచేసే ఇండోర్‌లోని డాలే కాలేజీలోనే చదివేరు. కానీ, ఆ ప్రభావం ఏదీ శ్రీవారిమీద పడిన జాడలు లేకపోగా... !

ఓసారి భారతదేశాన్ని పావనంచేసేందుకుగాను ఎనిమిదవ ఎడ్వర్డు చక్రవర్తిగా ప్రసిద్ధులైన ప్రిన్స్ ఆఫ్ వేల్సు పర్యటనకు వేంచేశారు. ఆచార ప్రకారం ఇండోర్‌కు ఆహ్వానింపబడి ఘనమైన విందుతో సన్మానింప బడ్డారు.

ఆ విందులో...

మహారాజా తుకోజీరావు హోల్కార్ వారేం చేశారంటే...

బ్రిటిష్‌వారి కానాడు బద్ధశత్రువుగా ఉన్న జర్మనీనేత కైజర్ విలియంను, ఆయన గుణగణాల్ని ఘనంగా కీర్తించేరు.

ఫలితంగా ఆ విందుకు హాజరైనవారూ ఆ విందు విశేషాలు విన్న బ్రిటిష్ ప్రభుభక్తులూ మహారాజా తుకోజీరావు హోల్కార్ వారిమీద ఆగ్రహంతో మండిపోయేరు.

ఇహ బ్రిటిష్‌పాలకుల సంగతి చెప్పేదేముంది. తక్షణం మహారాజా వారిని సింహాసనం నుండి ఊథబీకి ఉప్పుపాతర వేయాలని ఉడికి పోయేరు.

కానీ, బ్రిటిష్ సింహం తెలివైనది. కనుక సమయం కోసంచూస్తూ ఓ గొయ్యి త్రవ్వుకుని సిద్ధంగా ఉంది.

మహారాజా తుకోజీరావు హోల్కార్‌వారు తానెంతగా శివాజీ వార సుడ నని నమ్మినా ఒక్క విషయంలో మాత్రం శివాజీ మహారాజ్‌ను అనుకరించలేక పోయారు.

శ్రీవారు భోగలాలసులు, గోపికా లోలురు.

శ్రీవారు అమృతసర్‌నుండి ముంతాజ్‌బేగం అనే నాట్యకత్తెను తెప్పించుకుని ఉన్నారు. ఇండోర్‌లోని తమ రాచ ప్రాసాదంలో ఆవిడ సన్నిధిలో దినమొక క్షణంగా, బ్రతుకొక స్వప్నంగా గడిపివేస్తున్నారు.

ముంతాజ్ బేగం అపూర్వ మనదగిన మొగల్ సుందరి మాత్రమే గాక ఆరితేరిన జాణ, నాట్యంలో మేటి.

కనుక, మహారాజావారు తమ హృదయాన్నావిడ ఒడిలో వదిలేసి కాలక్షేపం చేయటంలో విశేషం లేదు.

కానీ ముంతాజ్‌కు మాత్రం రానురాను మహారాజా వారంటే మొహం మొత్తి పోయింది. చాలాసార్లు అమృతసర్‌కు పారిపోవాలని ప్రయత్నించింది. అయితే మహారాజావారీ సంగతి గ్రహించి అంతఃపురం చుట్టూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసేరు.

మహారాజావారు ప్రతి వేసవిలోనూ సపరివార సమేతంగా ముస్సోరీలో కాలక్షేపం చేయటం రివాజు. ఆ వేసవిలోకూడా అలాగే ఓ స్పెషల్ ట్రెయిన్‌లో వెళ్తూండగా ఢిల్లీ స్టేషన్‌వద్ద తన బంధువర్గ సాయంతో తన బోగీకి కాపలాగా ఉన్న మహారాజావారి అంగరక్షకులకు లంచాలిచ్చి ముంతాజ్ బేగం అదృశ్య మయిపోయింది.

అలా వెళ్ళి తల్లిసాయంతో ముంతాజ్ సాక్షాత్తు బాంబే మేయర్‌గారి బేగంగా ఆయనింట్లో కాపురం పెట్టింది.

సంగతి తెలిసిన మహారాజావారు ఉగ్రులై పోయేరు. అంగరక్షకుల్ని కొందర్ని డిస్మిస్ చేసేరు. మరికొందర్ని అరెస్టు చేయించేరు.

కానీ, ముంతాజ్ ఒడిలోంచి రాలిన శ్రీవారి హృదయం మాత్రం యధాస్థానానికి రాలేదు. మహారాజావారు ముంతాజ్‌ను మరచిపోలేక పోయేరు. ఆవిడ కౌగిట దొరికే ఆనందాన్ని మరో కౌగిట్లో పొందలేక పోయేరు.

అది చూసిన రాజభక్తులు కొందరు మహారాజుదయకు పాత్రులమై, వజ్ర వైఢూర్యాది కానుకలు దండిగా దక్కించుకో గలగాలంటే సదరు ముంతాజ్ బేగంను ఈడ్చుకొచ్చి శ్రీవారి ఒడిలో వదలటం సులు మార్గమని గ్రహించిన వారై....

బొంబాయికి పయన మయ్యేరు.

బొంబాయి మేయర్‌గారు అనుదినం ముంతాజ్ సహితంగా వ్యాహాళికై హేంగింగ్ గార్డెన్సుకు వేంచేస్తుంటారని తెలిసి కాపు వేసేరు.

ఓ దుర్దినాన మేయర్‌గారు ముంతాజ్ సహితంగా అటు వేంచేయగా కారుకు అడ్డంపడి ముంతాజ్‌ను బలత్కారంగా తమవాహనంలో వేసుకుని పలాయనం చిత్తగించాలని ప్రయత్నించేరు.

మేయర్‌గారు తక్కువ తిన్నవారా! పిస్తోలుతీసి వారిమీద తూటాలు వదలేరు. కానీ, రాజభక్తులు వెరవక మేయరుగారిని నిలువునా కాల్చేసి ముంతాజ్‌ను కారులో కెక్కించేరు.

ఇంతలో...

అటు షికారొచ్చిన ఇద్దరు బ్రిటిష్ సైనికోద్యోగులది చూసి వారి మీదపడి ఆయుధాల్తో అటకాయించి ఆరెస్టు చేసేరు.

ఆ మర్నాడు బ్రిటిష్ సింహం దీర్ఘనిశ్వాసం వదిలింది.

నేరం చేస్తుండగానే పట్టుబడటంతో నేరస్తులెవరూ తప్పించుకో వీలు లేక పోయింది. దబాయింపులూ సాధ్యంగాక పోయాయి.

పైగా, సాక్షాత్తూ మహారాజావారి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వారే బ్రిటిష్‌వారి పక్షంగా అపూర్వివరై పోయేరు.

మహారాజా తుకోజీరావు హోల్కార్ వారు నిస్సహాయులైనారు. శ్రీవారే ఇదంతా స్వయంగా చేయించారనుకునేందుకు తిరుగులేని సాక్ష్యాలు తయారయి పోయేయి.

అప్పుడు...

బ్రిటిష్‌వారు తమ రెసిడెంట్ ద్వారా కబురంపేరు.

"మహాప్రభో! తమరు గద్దెదిగి వాన ప్రస్థాశ్రమం స్వీకరిస్తారా? లేక కోర్టులో విచారణకు హాజరై జైలుకు పోదలచారా"? అని.

మహారాజావారు ఆలోచించారు. ఆలోచించారు, ఆలోచించేరు,

సింహాసనాన్ని బ్రిటిష్‌వారు చెప్పినట్లు కొడుక్కి అప్పగించేసేరు. మర్డర్ కేసు మాఫీ చేయిఒచుకున్నారు.

ఆ తర్వాత...

సమస్త రాజభరణాలూ, మనోవర్తులూ పొందేరు.

పొంది...

సుప్రసిద్ధురాలైన అమెరికన్ సుందరి నాన్సీ మిల్లర్‌ను అర్జంటుగా వివాహమాడేసి ఇండోర్ సమీపంలోనే గల మరో రాజభవనంలో దేవేంద్ర భోగాల్లో బ్రతకసాగేరు.

★